క్లుప్తంగా

రూ.10 కోట్ల పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో రూ.10 కోట్లతో చేపట్టే పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బుధవారం అమీన్‌పూర్ మున్సిపల్ సమావేశం మందిరంలో కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్పన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఇటీవల అమీన్‌పూర్‌లో విలీనమైన గ్రామాల కార్యదర్శులు కూడా పాల్గొన్నారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై కూడా చర్చించారు. అమీన్‌పూర్ పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతుల కల్పనకు వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కమిషనర్ జ్యోతి రెడ్డి, రెవెన్యూ అధికారి మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వడం.. తీసుకోవడం నేరం

సంగారెడ్డి: లంచం ఇవ్వడం.. తీసుకోవడం నేరమని విజిలెన్స్ సీఐ శ్యామల వెంకటేశం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం విజిలెన్స్ కార్యాలయంలో విద్యార్థులతో విజిలెన్స్ అవర్నెస్ వీక్ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్, రాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

మునిపల్లి(అందోల్): పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని ఎంపీడీఓ హరినందన్‌రావు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండలంలోని పెద్దలోడి గ్రామంలోని సెంటర్‌ను పరిశీలించారు. రికార్డులు, పిల్లల ఆటవస్తువులను పరిశీలించారు. ఆటవస్తువులపై పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. పిల్లల పలకలపై ఏబీసీడీలు పెట్టించి చదివించారు. కొద్దిసేపు పిల్లలతో కలిసి ఆడారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



విద్యార్థులతో కలిసి భోజనం చేసిన రమేష్

సంగారెడ్డి టౌన్: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత చదువులు చదవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఉపాధ్యాయులకు న్యాయపరమైన సేవలు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా

జిన్నారం(పటాన్‌చెరు): ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా అన్నారు. బుధవారం 3,6,8,9 వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.50 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టి సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికిరణ్ రెడ్డి, పుజాత మహేందర్‌రెడ్డి, ఏఈ కృష్ణయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్: ధరణి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి రమేష్ తహసీల్దార్ భాస్కర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 1985నుంచి ఇప్పటివరకు కబ్జాలో ఉండి పంటలు పండించుకుంటున్న ఆయా గ్రామాల్లో రైతులకు ఇంతవరకు పట్టా కాలేదని తెలిపారు. సాగుచేసుకుంటున్న భూములకు రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

పురపాలికలుగా పంచాయతీలు

ఇప్పటికే గ్రామపంచాయతీ రికార్డులు సేకరణ

- ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిన అధికారులు
- పరిసర గ్రామాలను కలుపుతూ పట్టణాలుగా గుమ్మడిదల, గడ్డపోతారం



జిన్నారం(పటాన్‌చెరు): క్రమబద్ధమైన అభివృద్ధి, ఆదాయ వనరుల సేకరణ దిశగా ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు సుముఖంగా ఉంది. ఈ మేరకు మున్సిపాలిటీల ఏర్పాటుకు అవసరమైన అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రచిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుపై తీవ్రంగా చర్చ కొనసాగుతోంది. ఇప్పటికే పలు ప్రతిపాదనలను అధికారుల బృందం సేకరించి, ఉన్నతాధికారులకు నివేదించారు.

జిన్నారం మండలంలో..

మండలంలో గడ్డపోతారం గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చే యోచనలో ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే అధికారుల బృందం పర్యటించి పలు అంశాలను నివేదికల రూపంలో తయారు చేశారు. గడ్డపోతారం, కాజిపల్లి, మాదారం, నల్తూర్, లక్ష్మీపతి గూడెం, వావిలాల, గ్రామాలను కలుపుతూ గడ్డపోతారం గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చేందుకు రంగం సిద్ధమవుతోంది.

మున్సిపాలిటీ వద్దని విజ్ఞప్తి

శరవేగంగా అధికారులు మున్సిపాలిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తుంటే మరోవైపు గుమ్మడిదల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహ్మను కలిసి మండలంగానే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేస్తానని హామీ ఇచ్చారు.

గుమ్మడిదల మండలంలో..

గుమ్మడిదల గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చే యోచనలో ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. అన్నారం, దోమడుగు, బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాలను కలుపుతూ గుమ్మడిదల మున్సిపాలిటీగా భారీ అవకాశం ఉంది.

పేదలపై భారం



గ్రామపంచాయతీ మున్సిపాలిటీలో విలీనమైతే పేద ప్రజలపై అదనపు భారం పడుతుంది. అన్ని రకాల పన్నులు పెరుగుతాయి. గ్రామపంచాయతీగానే ఉంటే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

– చిట్ల సత్యనారాయణ, కాజిపల్లి మాజీ సర్పంచ్

మండల కేంద్రంగా ఉంటేనే మేలు



మున్సిపాలిటీగా మారితే రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. పారిశ్రామిక వాడలో నివసించే వలస పేద కార్మికులు పన్నుల భారం తట్టుకోలేరు. సమస్యలు కూడా పెరుగుతాయి. కావునా మున్సిపాలిటీ వద్దని కోరుతున్నాం.

–పుట్టా నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు గుమ్మడిదల

నివేదికలు అందించాం

గడ్డపోతారం గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందజేశాం. ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు.

– రాజ్‌కుమార్ (ఎంపీఓ)

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం (పటాన్‌చెరు): విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్‌కాలనీ వద్ద నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలోని సబ్‌స్టేషన్‌పై అధికభారం పడటంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రూ.6 కోట్ల వ్యయంతో భారతినగర్ డివిజన్‌లో నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. గతంలో నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు, విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్‌రావు, ఏడీ దుర్గప్రసాద్, ఏఈ సంజీవరావు, ఆర్ఐ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు నగేష్, ఆదర్శ్‌రెడ్డి, ఐలేష్, పరమేష్‌లు పాల్గొన్నారు.

భెల్ భవన్స్‌లో ఘనంగా దివాళి మేళా



విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు



బహుమతులను అందిస్తున్న గోపాలకృష్ణన్, శ్రీనివాసరావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యాభవన్స్ పాఠశాలలో మంగళవారం రాత్రి ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి ఆధ్వర్యంలో దివాళి మేళాను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన అన్నమయ్య కళావైభవం నృత్యం అందరిని ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా భవాన్స్ హైదరాబాద్ కేంద్ర వైస్ చెర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, భెల్ జీఎం శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా భవాన్స్‌లో దివాళి మేళాను ఘనంగా నిర్వహించడం హర్షదాయకమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాట వేస్తున్నామన్నారు. దివాళి మేళా సందర్భంగా క్రీడాలు, తినుబండారాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ



పుల్‌కల్(అందోల్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పుల్‌కల్(అందోల్): కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని గ్లూర్, ఇసో జిపేట, మిన్‌పూర్, పెద్దారెడ్డిపేట, ముద్దాయిపేట, బస్వాపూర్, పోచారం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..17 శాతం తేమ వరకు ఆరబెట్టిన ధాన్యానికి క్వింటాలుకు రూ.2320 చెల్లిస్తారని తెలిపారు. దళారులకు విక్రయిస్తే తేమ, తరుగు సాకుతో కోతలు విధిస్తారని సూచించారు.

కృష్ణాపూర్‌లో

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ కృష్ణాగౌడ్ ధాన్యం తూకం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ, ఏఈఓ కృష్ణావేణి, సీఈఓ బ్రహ్మం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంతో పాటు ఊట్ల గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేజీ ఏపీఎం నరేందర్ మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ..దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు.

కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలి

సదాశివపేట (సంగారెడ్డి): కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టి, కొత్త పెన్షన్ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్యయ్యాయాదవ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన టీపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం, నూతన అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలకు లక్ష్మయ్యాయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలను తక్షణమే మంజూరు చేయడంతో పాటు పీఆర్సీ నివేదికను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శివశంకర్, ప్రధాన కార్యదర్శులుగా నర్సింలు, ఉపాధ్యక్షుడిగా జయకృష్ణ, నసీర్, మహేంద్రనాథ్, కార్యదర్శులుగా శశికళ, శ్రీధర్‌రెడ్డి, చరణ్‌కుమార్, ప్రవీణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్డీఓగా బాధ్యతల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్డీఓగా పి.రాంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఆర్డీఓ రాజు మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో పని చేసిన రాంరెడ్డి ఇక్కడికి వచ్చారు. పదవి బాధ్యతలు చేపట్టిన రాం రెడ్డిని కార్యాలయం సిబ్బంది సత్కరించారు.

అవినీతి రహిత సమాజం కోసం కృషి

సంగారెడ్డి టౌన్: అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం యువత కృషి చేయాలని సంగారెడ్డి విజిలెన్స్ ఎస్సై వెంకటేష్ అన్నారు. బుధవారం పట్టణంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అవినీతిని నిర్మూలించేందుకు కృషి చేయాలని, నైతిక విలువలు తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

సామాజిక ఆర్థిక సర్వేపై అవగాహన



సర్వేపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): సామాజిక ఆర్థిక సర్వేపై గ్రామస్థాయిలో ఎన్యుమరేటర్లకు ఎంపీడీఓ హరినందన్‌రావు అవగాహన కల్పించారు. బుధవారం మునిపల్లి రైతు వేదికలో సామాజిక ఆర్థిక సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 75 ప్రశ్నలకు ప్రతి కుటుంబం వద్ద క్షుణంగా వివరాలు సేకరించి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిగా వివరాలు సేకరించాలి

సంగారెడ్డి టౌన్: ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తీసుకోవాలని సంగారెడ్డి మండల ప్రత్యేక అధికారి కాశిమ్ బేగ్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో కుటుంబ సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడు తూ.. ఆర్థిక, కుల గణన పూర్తిస్థాయి వివరాలను సేకరించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశవర్కర్లు, అంగన్వాడీలు ఉన్నారు.

సర్వేపై శిక్షణ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండల కేంద్రల్లో బుధవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ నిర్వహించారు. సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, తదితర అంశాలపై అవగాహన కలిపించారు.

సోషల్ ఎకనామిక్ సర్వేపై శిక్షణ

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 6 నుంచి నిర్వహించనున్న సామాజిక ఆర్థిక విద్యా రాజకీయ కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై మున్సిపల్ అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

అడిషనల్ ఎస్పీ సంజీవరావు



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ

సంగారెడ్డి జోన్: ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు పేర్కొన్నారు. పదవి విరమణ పొందిన ఎస్సై చంద్రశేఖర్‌కు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 42 సంవత్సరాలుగా చంద్రశేఖర్ వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందారని అన్నారు. అంచలంచెలుగా పదోన్నతులు పొందుతూ.. సబ్-ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్స్ వెంకటేశం, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్.ఐ. రామారావు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని జహీరాబాద్ డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పనిచేసిన బి.రాము పదవీ విరమణ చేశారు. బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పదవిలో ఉన్నప్పుడు చేసిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. మాజీ కౌన్సిలర్ రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది మాత్రమే పదవి విరమణ పొందుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ అకౌంట్స్ మోహన్, మెకానికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ బంగి ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయుసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర లేబర్ కమిషనర్ కృష్ణ ఆదిత్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరాజం మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక అధికారుల తెలియజేసిన ప్రయోజనం లేదన్నారు. వెంటనే వారిని పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పునరావాసం కల్పించాలని నిరసన



ప్రతిజ్ఞ చేస్తున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కూలీలకు పునరావాసం కల్పించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని నిమ్జ్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బి.రాంచందర్ మాట్లాడుతూ.. నిమ్జ్‌లో పరిశ్రమలు స్థాపించడం వల్ల వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కూలీలు ఉపాధి కోల్పోవాల్సి వస్తుందన్నారు. నిమ్జ్ వల్ల జహీరాబాద్ నియోజకవర్గంలోని పలు గ్రామాల కూలీలు ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టులో కేసు కూడా వేశామన్నారు. కూలీలకు పునరావాసం కల్పించాలని కోర్టు కూడా ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ మేరకు నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల అధికారులకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో బర్దిపూర్, ఎల్గోయి తదితర గ్రామాలకు చెందిన కూలీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కార్మికుల సమ్మె నోటీసు



జహీరాబాద్ టౌన్: పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని లేని యెడల సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, కార్మిక యూనియన్ నాయకులు మహిపాల్ హెచ్చరించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులతో కలిసి బుధవారం కమిషనర్ ఉమామహేశ్వర్‌రావుకు నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ సమస్యపై పలు మార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. నవంబర్ 1న ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని, పెండింగ్ డబ్బులు చెల్లించకుంటే వచ్చే నెల 13 నుంచి సమ్మెకు దిగుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ నాయకులు యశోద, మోహన్, చంటి, కాంతమ్మ, సిద్ధమ్మలు ఉన్నారు.

◆ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ సింధు పేర్కొన్నారు. బుధవారం ఎల్ఐజీకాలనీలోని వార్డు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వెంటనే కాలనీల్లోని రోడ్ల సమస్యలను పరిష్కారించాలని సూచించారు. అవసరమైన చోట్ల యుద్ధప్రాతిపదికన రోడ్లకు మర్మమతులు చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.

◆ నెలలోనే పింఛన్ పత్రాలు మంజూరు

పటాన్‌చెరు టౌన్: ప్రతి నెల ప్రయాస్ పథకంలో భాగంగా పదవి విరమణ పొందిన నెలలోనే చందాదారులకు పింఛన్ పత్రాలను మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. బుధవారం సెప్టెంబర్ నెలలో పదవి విరమణ పొందిన 31 మందికి పింఛన్ పత్రాలు రెడీ చేసి, అందులో 13 మందికి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్-2 శ్రీదేవి, అకౌంట్ ఆఫీసర్ ప్రతిమ చందాదారులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఎర్రబొగూడ గ్రామానికి చెందిన ఆనంద్ రాథోడ్‌కు సీఎం సహాయనిధి నుంచి చెక్కు మంజూరయింది. సంబంధించిన చెక్కును బుధవారం ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు.

◆ పశువులకు వైద్య పరీక్షలు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బాచేపల్లి చాకలికుంట తండాలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వెటర్నరి అసిస్టెంట్ డాక్టర్ గీతా 22 పశువులకు గర్భస్థ పరీక్షలు, 4 పశువులకు గర్భధారణ టీకాలు ఇచ్చారు. 45 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తుక్కరెడ్డి సిబ్బంది జగదీష్, గోపాల మిత్రలు అశోక్, మల్లేశం, శ్రీనివాస్, సాయిలు, సంతోష్, నాగేష్, నారాయణ, అజ్మాత్ పాల్గొన్నారు.

దీపావళి సందడి

జిన్నారం(పటాన్‌చెరు) : గ్రామాల్లో దీపావళి పండుగ సందడి నెలకొంది. ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల ప్రధాన రహదారుల పక్కన దీపావళి సందర్భంగా చిరు వ్యాపారస్తులు పెద్ద ఎత్తున బొమ్మల షాపులు ఏర్పాటు చేశారు. దీంతో కొనుగోలుదారుల అభిరుచులకు తగ్గట్లుగా వివిధ అందమైన ఆకృతుల్లో తయారుచేసి అమ్మకాలు జరుపుతున్నారు. దీపావళికి ప్రతి ఇంట బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీ. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు బొమ్మలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఉమ్మడి మండలాల్లో పెద్ద ఎత్తున బొమ్మల షాపులతో పాటు, పూల దుకాణాలు స్వీట్ షాపులు, బాణాసంచా షెడ్లు పెద్ద ఎత్తున కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ఆకులపై లక్ష్మీదేవి



లక్ష్మీమాతను అరటి ఆకుపై మలచిన గుండుశివకుమార్

నారాయణఖేడ్: ఆశ్వయుజమాసం అమావాస్యరోజున ప్రదోషకాలంలో లక్ష్మీపూజ చేసి దీపాలు వెలిగించడం ఆనవాయితీ. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండుశివకుమార్ అరటి, రావి ఆకులపై లక్ష్మీమాత చిత్రాలు, దీపావళి తెలుగు అక్షరాలు, ఆడపడుచులు దీపం పట్టుకుని ఉన్న చిత్రాలను మలచి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



రావి ఆకుపై మలచిన దీపావళి అక్షరాలు